



మాట్లాడుతున్న డీఆర్వో సంగీత

కొత్త రేషన్‌కార్డులు వచ్చేశాయ్‌!



ఉమ్మడి జిల్లాకు 52,747 మంజూరు

ఎన్నోఏళ్ల నిరీక్షణకు తెరపడింది. ఎట్టకేలకు కొత్త రేషన్ కార్డులు వచ్చేశాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 52,747 కార్డులను ప్రభుత్వం మంజూరు చేసింది. కొత్తగా కార్డులు వచ్చినవారికి ఈ నెల నుంచే బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు చేశారు. కొత్త రేషన్ కార్డుల మంజూరుపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే కార్డులు రానివారి నుంచి దరఖాస్తులు తీసుకునే ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. విడతలవారీగా కొత్త కార్డులు మంజూరు చేస్తామని సర్కార్ ఇప్పటికే ప్రకటించింది.



ఈ నెల నుంచే కొత్త కార్డుదారులకు బియ్యం



జిల్లాలో కొత్తగా 6,700 మందికి ఈనెల నుంచి రేషన్ బియ్యం అందనుంది. కొత్త కార్డుదారుల డీకేఆర్ పూర్తయి నందున, వారు ప్రింటవుట్ తీసుకుంటే సరిపోతుంది. కొత్తకార్డుల పంపిణీ కార్యక్రమాలపై ఎటువంటి ఆదేశాలు రాలేవు.


-సుగుణాబాయి,
జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, మేడ్చల్

హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు.. హామీని నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం

నేటి నుంచి బియ్యం పంపిణీకి చర్యలు.. కొనసాగుతున్న దరఖాస్తుల ప్రక్రియ

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఏళ్లుగా రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు శుభవార్త చెప్పింది. లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి ప్రభుత్వం తొలి విడతగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు 52,747 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసింది. అందులో రంగారెడ్డి జిల్లాకు 23,643 రేషన్ కార్డులు మంజూరు కాగా, వికారాబాద్ జిల్లాకు 22,404, మేడ్చల్ జిల్లాకు 6,700 కార్డులు మంజూరయ్యాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డులు ఇస్తామని ప్రకటించింది. కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియలో భాగంగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో లేని జిల్లాల్లో శనివారం రేషన్ కార్డులు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన

మిగతా 7వ పేజీలో...



రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో కార్డులు లేని నిరుపేదలు ఇంకా దరఖాస్తులు చేసుకుంటూనే ఉన్నారు. మీ సేవ కేంద్రాల ద్వారా ప్రభుత్వం ప్రజల నుంచి ఈ దరఖాస్తులను స్వీకరిస్తుంది. మేడ్చల్ జిల్లాలో దరఖాస్తులు లక్షల్లో ఉండగా, ప్రభుత్వం కేవలం 6,700 కార్డులు మాత్రమే మంజూరు చేయడం గమనార్హం.

ఏం లచ్చన్నా.. పనులు ఎంతవరకు వచ్చాయి?

ఫ్యూచర్ సిటీ పనులపై సీఎం రేవంత్‌రెడ్డి ఆరా!

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు భూసేకరణలో సహకారంపై కేఎల్లాఆర్‌కి కితాబు

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని ఆదేశం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): ఫ్యూచర్ సిటీ భూసేకరణ పనులపై సీఎం రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టిన మీనాక్షి నటరాజన్‌ను శుక్రవారం ఆయనతో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు దిల్‌కుష్ గెస్ట్‌హౌస్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డిని సీఎం రేవంత్‌రెడ్డి పలకరించారు. వీరిద్దరూ జిల్లా రాజకీయాలు, ఇతర అంశాలపై కాసేపు ముచ్చటించుకున్నారు.



కేఎల్లార్‌తో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

గెలుపు గుర్రాలకే అవకాశం

ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీకి వెళ్లే 330 అడుగుల గ్రీన్ ఫీల్డ్ రోడ్డు భూసేకరణ పనులపై సీఎం ఆరా తీశారు. ఏం లచ్చన్నా.. భూసేకరణ పనులు ఎంత వరకు వచ్చాయని అడిగారు. త్వరగా ఈ పనులు పూర్తయ్యేందుకు అధికారులకు సహకరించాలని చెప్పారు. గ్రీన్ ఫీల్డ్ రోడ్డు ఏర్పాటుతో ఆ ప్రాంతానికి ఎంతో మేలు జరుగుతుందని సీఎం వివరించారు. మీరంతా కూడా భూసేకరణ విషయంలో సహకరిస్తుండడం అభినందనీయమన్నారు. మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్నందుకు ఈ సందర్భంగా కేఎల్లాఆర్‌ను అభినందించారు. వచ్చే స్థానిక ఎన్నికలకు సమాయత్తం కావాలని ఆదేశించారు. విజయం సాధించే గెలుపు గుర్రాలను ఎంపిక చేయాలని సూచించారు.

చేవెళ్లలో జిల్లా అదనపు కోర్టు ప్రారంభం

రూ.2 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి సేఫ్

7లో

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

» డీఆర్వో సంగీత

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియెట్ పరీక్షలు ఈనెల 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఆర్వో సంగీత తెలిపారు. పరీక్షలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే పరీక్షలకు జిల్లాలో 185 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 77,863 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు, 69,348 మంది రెండో సంవత్సరం విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని చెప్పారు. ప్రశ్నాపత్రాల స్టోరేజీ పాయింట్లు 31 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఇంటర్మీడియట్ అధికారి వెంక్యానాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు, ఆర్డీవోలు జగదీశ్వర్‌రెడ్డి, అనంతరెడ్డి, చంద్రకళ పాల్గొన్నారు.

రైతులు ఉద్యాన పంటలు సాగు చేయాలి

జిల్లా ఉద్యానశాఖ అధికారి సురేష్

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : స్వల్ప పెట్టుబడి, తక్కువ నీటితో అధిక లాభాలు వచ్చే ఉద్యాన పంటల సాగుకు రైతులు మొగ్గు చూపాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి సురేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని మన్సాన్‌పల్లిలో ఆయిల్ పామ్, డ్రాగన్ ఫ్రూట్స్, చామంతి తదితర పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యాన పంటలకు డ్రిప్ ఉపయోగించడం వలన నీటిని పొదుపు చేసుకోవచ్చన్నారు. అలాగే చీడపీడల బెడద ఉండదన్నారు. కూలీల అవసరం కూడా తక్కువగా ఉంటుందన్నారు. పామాయిల్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యాన వనశాఖ డివిజన్ అధికారి సౌమ్య, రైతులు పాల్గొన్నారు.

దోపోత్సవం.. భక్త జనసందోహం

గోవింద నామస్మరణతో మార్మోగిన బాలాజీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం

చేవెళ్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల బాలాజీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి దోపోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి అమావాస్య సందర్భంగా గురువారం రాత్రి 9 గంటల నుంచి శుక్రవారం తెల్లవారుజామున 2 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. దేవాలయ ప్రాంగణం నుంచి స్వామివారి పుష్కరిణి వరకు దేవతామూర్తుల ఊరేగింపు కార్యక్రమం అంగరంగ వైభవంగా చేపట్టారు. అదేవిధంగా అలివేలు మంగమ్మను సంప్రదాయబద్ధంగా ఊరేగింపుగా పుష్కరిణి వరకు తీసుకువచ్చారు. అనంతరం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి 15 మంది చెంచుల నృత్య ప్రదర్శన అలరించింది. దీంతో ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మార్మోగింది. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ పుష్కరిణి వద్ద ఆధ్యాత్మికవేత్త పొద్దటూర్ ఎల్లారెడ్డి బృందం నిర్వహించిన జానపద, నృత్య, ధార్మిక ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. బాలాజీ ఆలయంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి ప్రభుత్వ విప్ మహేందర్‌రెడ్డి స్వామివారికి ప్రత్యేక

మిగతా 8వ పేజీలో...



దోపోత్సవం సందర్భంగా బాలాజీ లక్ష్మీవేంకటేశ్వర స్వామిని ఊరేగిస్తున్న భక్తులు

కేంద్ర బడ్జెట్‌లో మత్స్యకారులకు అన్యాయం

మత్స్య కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో మత్స్యకారుల సంక్షేమానికి అవసరమైన నిధులను కేటాయించలేదని మత్స్య కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. 50 ఏళ్ల వయసు నిండిన మత్స్యకారులకు పెన్షన్లు మంజూరు చేయాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధి కోసం రూ.5వేల కోట్లు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. చెరువులు, కుంటల్లో కంప చెట్లను తొలగించాలని వారు కోరారు. సమావేశంలో మత్స్య కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చెనమోని శంకర్ తదితరులున్నారు.

సవాళ్లు ఎదుర్కొంటేే ఆర్థికాభివృద్ధి సాధించవచ్చు

» తెలంగాణ ఐటీ, పరిశ్రమల ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రాన్ని శాస్త్ర, సాంకేతిక, విజ్ఞాన రంగాలలో శరవేగంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తెలంగాణ ఐటీ, పరిశ్రమల ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్ అన్నారు. శుక్రవారం నందిగామ మండలం కన్హాశాంతివనంలో జరిగిన స్టార్టప్ ఫోరమ్-2025 అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఐటీ, పారిశ్రామిక సీఈవోల నుద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతీయువకులకు స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ప్రావీణ్యులుగా తీర్చిదిద్ది ఉద్యోగ రంగాల్లో ఉపాధి కల్పించేందుకు యూనివర్సిటీని ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు. దేశీయ, విదేశీయ పెట్టుబడులతో వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు వెసులుబాటు కల్పించడంతో పాటు ప్రభుత్వం సహాయ సహకారాలను అందిస్తుందన్నారు. భారతదేశం ప్రపంచ



సదస్సులో మాట్లాడుతున్న జయేశ్ రంజన్

ఆర్థికశక్తి కేంద్రంగా ఎదుగుతున్నందున దాన్ని స్టార్టప్ పర్యావరణ వ్యవస్థ స్థిరమైన వృద్ధిని నడిపించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. హార్ట్‌ఫుల్‌నెస్ స్టార్టప్ ఫోరమ్ నాయకులుగా అభివృద్ధి చెందడానికి స్పష్టత, ప్రశాంతత, శ్రేయస్సును పెంపొందించడానికి 200 మంది వ్యవస్థాపకులను ఒకచోట చేర్చడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో పారిశ్రామిక ప్రతినిధులు శ్రీనివాసురాజు, ఫణీంద్ర, వాణి కోలా, ఆర్తి గుప్తా, లక్ష్మీ, ప్రజ్ఞ, మల్లికారెడ్డి రామచంద్రమిషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

భూముల పరిరక్షణకు రైతులు సంఘటితంగా పోరాడాలి

» కిసాన్‌సంఘ్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సునిలం



మాట్లాడుతున్న సునిలం

యాచారం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రైతులు సంఘటితంగా ఉండి పోరాటం చేసి ఉంటే ఫార్మాసిటీకి భూములు కోల్పోయే వారు కాదని, వీరి అనైక్యతను ఆసరాగా చేసుకొని పాలకులు భూసేకరణ చేపట్టారని కిసాన్‌సంఘ్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సునిలం అన్నారు. యాచారం మండలం తాటిపర్తిలో శుక్రవారం ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం భూసేకరణ చేపట్టినప్పుడు రైతులకు భూమికి బదులు భూమి ఇవ్వాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇప్పటి నుంచైనా రైతులు సంఘంగా ఏర్పడి భూములను కాపాడుకోవడానికి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాయిఘడ్‌లో అంబానీ కోసం 50వేల ఎకరాల భూములు తీసుకునేందుకు ప్రభుత్వం యత్నిస్తే మేం సంఘంగా ఏర్పడి భూసేకరణ అడ్డుకున్నామని చెప్పారు. బడా కంపెనీల ఏర్పాటుకు రైతుల భూములు తీసుకుంటే వారు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. విషతుల్యమైన ఫార్మాసిటీ ఏర్పాటుకు 2500 ఎకరాల భూసేకరణను చేపట్టడం దారుణమన్నారు. ఫార్మా వద్దని రైతులు డిమాండ్ చేస్తున్నా పాలకులు ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. రైతుల పట్టాభూములను నిషేధిత జాబితాలో పెట్టడానికి ప్రభుత్వానికి అధికారం లేదన్నారు. విషతుల్యమైన ఫార్మా కంపెనీలు పచ్చటి పొలాల మధ్య ప్రభుత్వం యత్నించడం మంచిదికాదని ప్రముఖ పర్యావరణవేత్త, రాష్ట్ర మానవ హక్కుల వేదిక కన్వీనర్ డాక్టర్ కె.బాబురావు పేర్కొన్నారు. సభలో ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ కవుల సరస్వతి. యుగంధర్‌రెడ్డి, దేవోజీ, నిరంజన్, శ్రీకాంత్ ఉన్నారు.

పోలీస్ వ్యవస్థలో జాగిలాలది ముఖ్య భూమిక

» దర్యాప్తులో అధిక ప్రాధాన్యం

» తెలంగాణ రాష్ట్ర ఇంటలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి

» మొయినాబాద్ ఐఐటీఏలో 24వ బ్యాచ్ జాగిలాల పాసింగ్ ఔట్ పరేడ్

చేవెళ్ల, ఫిబ్రవరి 28: పోలీసు శాఖలో నమోదయ్యే కేసుల దర్యాప్తుల విషయంలో జాగిలాల పాత్ర అతి కీలకమని వాటి ద్వారా ఎన్నో కేసులను ఛేదించి నిందితులను గుర్తించడం సులభతరమైన విషయమని తెలంగాణ రాష్ట్ర ఇంటలిజెన్స్ డీజీ బి. శివధర్‌రెడ్డి అన్నారు. మొయినాబాద్‌లోని ఐఐటీఏ జాగిలాల శిక్షణ కేంద్రంలో 9 నెలల పాటు ట్రైనింగ్ పొందిన (24వ బ్యాచ్) 72 జాగిలాల పాసింగ్ ఔట్ పరేడ్‌లో ఆయన పాల్గొన్నారు. శిక్షణ పొందిన జాగిలాలకు సంబంధించి ట్రైనర్‌లకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ వీవీఐపీల భద్రతలో జాగిలాల పాత్ర గణనీయంగా ఉపయోగపడుతుందని తెలిపారు. మొయినాబాద్ ఐఐటీఏలో అన్ని వసతులతో మెరుగైన శిక్షణ కేంద్రంగా దేశంలోనే అగ్రగామిగా ఉందని చెప్పారు. మన రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన జాగిలాలకూ ఇక్కడ ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. పోలీసు శాఖలో నమోదయ్యే కేసుల దర్యాప్తుల విషయంలో వీటి పాత్ర అతి కీలకమని, కేసులను ఛేదించి నిందితులను గుర్తించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో యాంటీ ర్యాగింగ్, మాదకద్రవ్యాల సరఫరా ఛేదన, చోరీలు, అంతర్రాష్ట్ర ముఠాలతో పాటు సైబర్



డీజీ శివధర్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న మొయినాబాద్ ఐఐటీఏ కేంద్రం ప్రిన్సిపాల్ అరవింద్‌రావు

క్రైమ్ అరికట్టడంతోపాటు మరెన్నో కేసులు ఛేదించడంలో జాగిలాల పాత్ర పోలీసుల దర్యాప్తుకు మించి ఉంటుందన్నారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పటిష్టంగా ఉందని, ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని, అదే సమయంలో నేరస్థుల పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. పోలీసుశాఖ తరపున మొయినాబాద్ ఐఐటీఏ కేంద్రానికి పూర్తి సహకారం ఉంటుందని చెప్పారు. ఈ ఏడాదిలో దాదాపు ఈ శిక్షణ కేంద్రంలో 72 జాగిలాలు శిక్షణ పొందాయి. త్వరలో విధుల్లో చేరే అవకాశం ఉంది. ఈ సందర్భంగా శిక్షణ పొందిన జాగిలాల విన్యాసాల ప్రదర్శనను ఏర్పాటు చేయగా డీజీ తిలకించారు. ఈ కార్యక్రమంలో గోవా, త్రిపుర, బిహార్ రాష్ట్రాలకు చెందిన ఐజీలతో పాటు మొయినాబాద్ ఐఐటీఏ కేంద్రం ప్రిన్సిపాల్ అరవింద్‌రావు, ఆర్ఐ ఎక్బాల్, ఆర్ఎస్ఐ వెంకన్న, జాగిలాల ట్రైనర్స్ క్రాంతి రణదేవ్, రాజు, ప్రభాకర్, రాయప్ప, సుదర్శన్, రమేష్, ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



జాగిలాల విన్యాసాలు



బండను లాగుతున్న ఎద్దులు

అట్టహాసంగా బండలాగుడు పోటీలు

షాబాద్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : షాబాద్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామ పంచాయతీకి అనుబంధ గ్రామమైన సాయిరెడ్డిగూడలోని మల్లన్న ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆలయం సమీపంలో బండలాగుడు పోటీలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ పోటీల్లో 13 జతల ఎద్దులు పాల్గొన్నాయి. గెలుపొందిన వారికి మొదటి బహుమతి గోపాల్‌కు రూ.70వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో దేవాలయ నిర్వాహకులు పొన్న సుధాకర్‌రెడ్డి, దోనూరి గోపాల్, గ్రామస్తులు శేఖర్‌రెడ్డి, శంకరయ్య, సాయిరెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ముత్యాల్‌రెడ్డి, వీరలయ్య, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

పరీక్షలు పక్కాగా నిర్వహించాలి

యాచారం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలు పక్కాగా నిర్వహించాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని యాచారం ఎంపీడీవో జి.నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేసి ఏర్పాట్లను పరిశీలించారు. 330 మంది విద్యార్థులకనుగుణంగా ఏర్పాట్లు చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావును ఆదేశించారు.



ఘనంగా కల్యాణోత్సవం



ఆలయానికి బోనాలతో వస్తున్న మహిళలు


ఆలయం వద్ద ఎంపీ ఈటల రాజేందర్

మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కల్యాణోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు నెత్తిన బోనంతో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులతోపాటు బీజేపీ నాయకులు దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, అమరం మోహన్‌రెడ్డి, సరస్వతి పాల్గొన్నారు.
















మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ మొగులయ్య

కులకచర్ల సొసైటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

కులకచర్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల సొసైటీని ఉమ్మడి జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ కనకం మొగులయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సొసైటీ పరిధిలో 17,988 మంది సభ్యులుండగా, ఇందులో 5,956 మంది సభ్యత్వం పొంది ఉన్నారని, 12,032 మంది తాత్కాలిక సభ్యులుగా ఉన్నారని వివరించారు. బంగారంపై రుణాలు 1,480 మందికి రూ.12.45 కోట్లు, స్వల్పకాలిక రుణాలు 1,444 మంది రైతులకు రూ.12.65 కోట్లు, దీర్ఘకాలిక రుణాలు 958 మంది రైతులకు రూ.27.36 కోట్లు, స్వయం ఉపాధి కింద 80 మందికి రూ.14.60 లక్షలు అందించామని చెప్పారు. గతేడాది నికర లాభం రూ.1.84 కోట్లు వచ్చిందని, కొత్తగా రైతులకు రుణాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు, పాంబండ ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్‌రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ నాగరాజు, సీఈవో బక్కారెడ్డి, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, మేనేజర్ అంజనేయులు, పాలకవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి తాత్కాలిక పీఎస్ ప్రారంభం


సీఐ శ్రీనివాస్‌గౌడ్‌తో మాట్లాడుతున్న డీసీపీ శ్రీనివాస్

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): నూతనంగా భవనం నిర్మిస్తున్నందున పోలీస్‌స్టేషన్‌ను అంబేద్కర్ భవన్‌లోకి మార్చినట్లు రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. నార్సింగి ఏసీపీ రమణగౌడ్‌తో కలిసి అంబేద్కర్ భవన్‌లో తాత్కాలిక పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ప్రారంభించారు. పోలీస్‌స్టేషన్ తాత్కాలిక భవనం కోసం అనువైన వాటిని వెతికామని, అంబేద్కర్ భవన్ సౌకర్యవంతంగా ఉందని తెలిపారు. పోలీస్‌స్టేషన్ కోసం అంబేద్కర్ భవన్‌ను ఇచ్చిన సంఘ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్‌ను అభినందించారు. 35 ఏళ్ల క్రితం నిర్మించిన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పూర్తిగా పాడైనందున, అత్యాధునిక హంగులతో కొత్తది నిర్మిస్తున్నట్లు చెప్పారు. భవన నిర్మాణం పూర్తయ్యే వరకు కార్యకలాపాలు అంబేద్కర్ భవన్‌లోనే కొనసాగుతాయని తెలిపారు. సీఐలు వీరబాబు, సమరంరెడ్డి, ఎస్సైలు సుందరయ్య, బేతప్ప, సిబ్బంది ఉన్నారు.

సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

టీయూడబ్ల్యూజే-ఐజేయూ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి


మాట్లాడుతున్న కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో టీయూడబ్ల్యూజే-ఐజేయూను బలోపేతం చేసేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు యూనియన్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా యూనియన్ కార్యవర్గ సమావేశం తొర్రూర్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 3 వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టిన తర్వాత జిల్లా మహాసభలు నిర్వహిస్తామని తెలిపారు. మహాసభల సందర్భంగా జిల్లాలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న జర్నలిస్టులను ఘనంగా సన్మానిస్తామని పేర్కొన్నారు. ఆయా నియోజకవర్గాలకు జిల్లా కమిటీ బాధ్యులు, ఆయా ప్రెస్ క్లబ్‌ల అధ్యక్షులు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తారని చెప్పారు. సమావేశంలో యునియాన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, మఫిసిల్ జర్నలిస్టు ఫోరమ్ రాష్ట్ర కన్వీనర్ గుడిపల్లి శ్రీనివాస్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ జాతీయ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సలీమ్ పాషా, సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు కటకం సుభాష్, ప్రసాద్, సంయుక్త కార్యదర్శులు జగన్ గౌడ్, రాజేష్, కోశాధికారి సంరెడ్డి శశిపాల్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు పాండు, వెగ్గలం శ్యామ్, బద్ధుల మల్లేష్ యాదవ్, దర్శనం జంగయ్య, రచ్చ శేఖర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

మీసేవలో విజిలెన్స్ తనిఖీ


ఆపరేటర్‌తో మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారులు

వికారాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్త తనిఖీల్లో భాగంగా విజిలెన్స్ అధికారులు వికారాబాద్ జిల్లా కేంద్రంలోని మీ సేవ కేంద్రంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ఉన్న మీ సేవ సెంటర్‌కు ఒక్కసారిగా వచ్చిన అధికారులు లోపలికి ఎవరినీ అనుమతించకుండా విచారణ చేపట్టారు. ఆపరేటర్‌తో మాట్లాడి పలు వివరాలను తెలుసుకున్నారు. మీ సేవకు సంబంధించిన అనుమతి పత్రాలు, ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. మీ సేవలలో అధిక డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో విజిలెన్స్ అధికారులు దాడులు చేసినట్లు సమాచారం. అయితే వచ్చిన అధికారులు మీడియాతో మాట్లాడకుండా వెళ్లిపోయారు.

బాలికపై లైంగికదాడికి యత్నం

దోమ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల బాలికపై ఓ వ్యక్తి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా దోమ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అదే గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాలికపై తన ఇంట్లో లైంగికదాడికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు వ్యక్తిని పట్టుకొని చి తకబాది తల్లిదండ్రులు, పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న ఎస్సై అరవింద్‌కుమార్ వ్యక్తిని అదుపులోకి తీసుకొని పూర్తి విచారణ చేపట్టి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అడవుల మైసమ్మకు ఘనంగా బోనాలు


అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చల్లంగా చూడమ్మ మైసమ్మ తల్లీ అంటూ మహిళలు అమ్మవారికి బోనాలతో నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శుక్రవారం మండల పరిధిలోని మైసమ్మతండా సమీపంలో వెలసిన అడవుల మైసమ్మతల్లికి చిట్లపల్లి, ఖాజాఅహ్మద్‌పల్లి, పోచమ్మ తండా, మైసమ్మతండాకు చెందిన మహిళలు బోనాలను ఎత్తుకుని డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య ఆలయానికి చేరుకొని నైవేద్యం సమర్పించారు. అమ్మవారికి కోడి పుంజులు, మేక పోతులను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సుఖ సంతోషాలతో, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించుకుందాం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: పరిగిలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించుకుందామని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఉత్సవాలకు సంబంధించి దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఆలయ ఆవరణలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు గతంలో ప్రైవేట్ వ్యక్తుల ఆధ్వర్యంలో జరిగేవన్నారు. గతేడాది నుంచి దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతుండడం శుభపరిణామమన్నారు. మార్చి 9, 10, 11 తేదీల్లో మూడు రోజులపాటు ఉత్సవాలను దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ ఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం

నవాబుపేట: మండలంలోని నారేగూడ గ్రామంలో శుక్రవారం శ్రీ భవాని రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ పీఠాధిపతి డాక్టర్ పర్వేద మాణిక్‌రావు, లత దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ రాష్ట్ర జాయింట్ కార్యనిర్వాహణ అధికారి అమృత్‌రావు, భజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు, బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రకాంత్ పాల్గొన్నారు.

అట్టహాసంగా మల్లన్న జాతర


ఉత్సవాల్లో నిప్పులపై నడుస్తున్న భక్తులు

కులకచర్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పయిపల్లి గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజులుగా మల్లన్న జాతర ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున అగ్నిగుండం మహోత్సవం నిర్వహించారు. భక్తులు నిప్పులపై నడిచారు. స్వామివారికి అభిషేకం, కల్యాణ మహోత్సవం, అఖండ భజనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

అప్పులపాలవుతున్నా పట్టించుకోరా?

» మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజాపాలనలో పంచాయతీ కార్యదర్శులు వడ్డీలకు అప్పులు తెచ్చి గ్రామ పంచాయతీలను నిర్వహించడం దురదృష్టకరమని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఆరోపించారు. శుక్రవారం మహేశ్వరం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో అభివృద్ధి పనులు, పంచాయతీల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు తమ గోడును వెల్లబోసుకున్నారు. సంవత్సరకాలంగా రూ.30 వేల జీతంతో కాలం వెళ్లదీస్తున్నామని, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు విడుదల కాకపోవడంతో అప్పులు చేస్తున్నామని వాపోయారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో గ్రామాల అభివృద్ధి ఆగలేదని, ప్రజాపాలనలో సీఎం రేవంత్ రెడ్డి పంచాయతీ కార్యదర్శులను అప్పుల ఊబిలోకి నెడుతున్నారన్నారు. గతంలో మిషన్‌బగీరథ నీరు సాఫీగా సరఫరా అయ్యేదని, ప్రస్తుతం తాగునీరు అందడం లేదన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ పాండుయాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో శైలజ తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో సిబ్బంది కీలకం

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో సెర్ప్ అధికారులు, ఐకేపీ సిబ్బంది పాత్ర కీలకమని డీఆర్డీవో శ్రీలత అన్నారు. శుక్రవారం మండలంలోని పులిమామిడి గ్రామాన్ని సందర్శించారు. డ్వాక్రా మహిళలు, వన నర్సరీ, ప్రభుత్వ పాఠశాలను పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల యూనిఫాం కుట్టడానికి సెర్ప్ అధికారులు ఎదుర్కొన్న సమస్యలపై ఆరా తీశారు. యూనిఫాం కుట్టే సమయంలో విద్యార్థుల నుంచి కొలతలు తీసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి డీఆర్డీవో దృష్టికి తెచ్చారు. డ్వాక్రా మహిళలు పొందిన రుణాలను సకాలంలో చెల్లించాలని సూచించారు. వర్షాకాలం వచ్చే నాటికి వన నర్సరీలలో మొక్కలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సరిత, ఏపీఎం కవి, ఏపీవో ఎన్ను రవీందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజుగౌడ్, టీఏ బొక్క బాల్‌రెడ్డి, ఐకేపీ సీసీలు, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి నిరంతర విద్యుత్

» ట్రాన్స్‌కో ఎస్ఈ లీలావతి

ధారూరు, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరంగా సరఫరా చేస్తున్నామని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ లీలావతి అన్నారు. మండల పరిధిలోని కేరెల్లి గ్రామ పరిధిలో విద్యుత్ అధికారులతో కలిసి శుక్రవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. రైతులతో మాట్లాడి విద్యుత్ సరఫరాలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యుత్ అంతరాయం రాకుండా ఇంటర్మీడియట్ పోల్స్, ఆన్ ఆఫ్ స్విచ్‌లు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యుత్ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కొంత మంది రైతులు విద్యుత్ సమస్యలను ఎస్ఈ దృష్టికి తెచ్చారు. మున్నూర్ సోమారం విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి కేరెల్లికి విద్యుత్ సరఫరా చేయటం వల్ల తరుచూ అంతరాయం ఏర్పడుతుందని, ధారూరు విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి సరఫరా చేయాలని రైతులు కోరారు. విద్యుత్ అధికారులు సరిగా స్పందించటం లేదని ఫిర్యాదు చేశారు. ఎస్ఈ వెంట వికారాబాద్ ట్రాన్స్‌కో డీఈ సంజీవ్, ఏడీ సత్యనారాయణ ఉన్నారు.

శివ కలశం @ రూ.1.05 లక్షలు


కలశంతో ఊరేగింపుగా వెళ్తున్న ఆర్తితో ఆలయ నిర్వాహకులు

బషీరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గణేశ్ లడ్డూ వేలం నిర్వహించడం చూశాం. కానీ, బషీరాబాద్ మండలం జీవన్గిలోని శ్రీమహాదేవలింగేశ్వరాలయంలో శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలందుకున్న శివ కలశాన్ని ఆలయ నిర్వాహకులు శుక్రవారం వేలం వేశారు. 38 ఏళ్లుగా ఈ సంప్రదాయింం కొనసాగుతోంది. కలశం పొందిన వారికి అన్నీ శుభాలే జరుగుతాయని భక్తుల నమ్మకం. ఈ సారి బషీరాబాద్‌కు చెందిన ఆర్తి(సెమెంట్ వ్యాపారి) వేలం పాటలో రూ.1,05,000కు కలశాన్ని సొంతం చేసుకుంది. ఆలయ చరిత్రలో ఇదే అత్యధిక పలికిన వేలం పాట. అనంతరం డప్పులు, వాయిద్యాల మధ్య శివ కలశాన్ని ఊరేగింపుతా ఆర్తి ఇంటికి తీసుకెళ్లారు. గతేడాది మెద్చేల్‌కు చెందిన భీంరెడ్డి రూ.85,116కు కలశాన్ని దక్కించుకున్నారు.

వేసవిలో నీటికొరత లేకుండా చూడాలి

కోట్‌పల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వేసవిలో నీటికొరత లేకుండా చూడాలని డీపీవో జయసుధ అన్నారు. మండలంలోని బార్వాద్ గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం పలు రికార్డులను పరిశీలించి ఇంటి పన్ను 100 శాతం పూర్తిచేయాలని సూచించారు. గ్రామంలోని శ్మశానవాటిక, కంపోర్టుషెడ్డు, పార్కు, నర్సరీలను పరిశీలించారు. వేసవి సమీపిస్తుండటంతో గ్రామంలో మిషన్ భగీరథ నీటికి ఆటంకం కలిగినప్పుడు నీటిఎద్దడి రాకుండా ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలన్నారు. చేతిపంపులు, బోరు మోటార్లు సరిచేసుకోవాలని తెలిపారు. పంచాయతీలో ఇప్పటికే 65శాతం ఇంటి పన్ను వసూలు కాగా దానిని 100 శాతానికి పూర్తి చేయాలన్నారు. నర్సరీలో మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహించకుండా ఏపుగా పెరిగేందుకు ఎప్పటికప్పుడు నీరుపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీవో అనంత రాజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మసియోద్దీన్, తదితరులు ఉన్నారు.

కొత్త రేషన్‌కార్డులు వచ్చేశాయ్!



(ఐదో పేజీ తరువాయి)

కుటుంబాలకు రేషన్ కార్డులు ఇవ్వడం తోపాటు బియ్యం పంపిణీ చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

వికారాబాద్ జిల్లాలో ఇదివరకు 2,41,179 రేషన్ కార్డులు ఉండగా, వాటిలో 2,14,484 ఆహార భద్రత, 26,659 అంత్యోదయ, 36 అన్నపూర్ణ కార్డులు ఉన్నాయి. రేషన్ కార్డులు లేనివారు కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. దీంతో ప్రజాపాలన కార్యక్రమంతో పాటు ప్రజావాణి, సమగ్ర ఇంటింటి సర్వే ద్వారా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. సంవత్సరాల తరబడి కొత్త రేషన్ కార్డుల పంపిణీ జరగకపోవడంతో పేదలు గంపెడాశతో ఎదురు చూస్తున్న విషయం తెలిసిందే. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమల్లో రేషన్ కార్డు కీలకం కావడంతో దాని ప్రాధాన్యత పెరిగింది. వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన ఉన్నతాధికారులు తొలి విడతలో వికారాబాద్ జిల్లాకు 22,404 రేషన్ కార్డులు మంజూరు చేశారు. కొత్తగా మంజూరైన రేషన్ కార్డులతో కలిపి వికారాబాద్ జిల్లాలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 2,63,583కు చేరింది.

రంగారెడ్డి జిల్లాలో 5,58,410 రేషన్ కార్డులు ఉన్నాయి. వాటిలో అంత్యోదయ 33481, ఆహార భద్రత 5,24,890, అన్నపూర్ణ 39 కార్డులు ఉన్నాయి. జిల్లాకు కొత్తగా 23,643 కార్డులు మంజూరయ్యాయి. పాతవి, కొత్తవి కలిపి మొత్తం కార్డుల సంఖ్య 5,82,053కు చేరుకుంది. కొత్త రేషన్ కార్డులకు మార్చి నెల నుంచే బియ్యం పంపిణీ చేయనున్నారు. ఇదిలా ఉంటే, అర్హులైన కుటుంబాలకు విడతల వారీగా రేషన్ కార్డులు మంజూరు చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా ప్రజాపాలనలో 1,21,016, గ్రామ సభలు, వార్డు సభల్లో 33,435 దరఖాస్తులు రేషన్ కార్డుల కోసం అందాయి. ఇందులో గ్రామ సభలు, వార్డుల్లో అందిన 33,435 దరఖాస్తులు వంద శాతం డాటా ఎంట్రీ పూర్తయ్యింది. జనవరి 26న నాలుగు పథకాల ప్రారంభోత్సవంలో ప్రభుత్వం జిల్లాలో కేవలం ఐదు గ్రామాల్లో 118 కార్డులను మాత్రమే అందించింది. ప్రభుత్వం నిర్వహించిన కుల గణన ద్వారా విచారణ చేపట్టిన అధికారులు 6700 మందికి నేటి నుంచి కొత్తగా రేషన్ కార్డులు అందించనున్నారు.

గ్రామాల వారీగా లబ్ధిదారులు

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వం నేటి నుంచి 6,700 మందికి కొత్తగా రేషన్ కార్డులు అందజేయనుంది. అందులో కీసరలో 984, ఘట్‌కేసర్ మండలంలో 786, మేడిపల్లిలో 1071, మూడుచింతలపల్లిలో 253, కాప్రాలో 1516, గండిమైసమ్మ(దుండిగల్)లో 573, బాచుపల్లిలో 203, శామీర్‌పేట 538 కార్డులు అందించనున్నారు. జిల్లాలో కీసర, మల్కాజిగిరి రెండు డివిజన్లలో సివిల్ సప్లయ్ శాఖలో బాలానగర్, ఉప్పల్ సర్కిల్స్ అర్బన్‌లో 6 మండలాలున్నాయి. వీటి పరిధిలో మొత్తం 619 రేషన్ దుకాణాలున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు 5,23,800 కార్డులుండగా కొత్తగా 6700 కార్డులు అందించనున్నారు.

రూ.2 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి సేఫ్

» సమయానికి అధికారుల స్పందన


సర్వే నెంబర్ 53లో సర్వే చేస్తున్న సర్వేయర్ వెంకటేష్

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారులు సమయానికి స్పందించి రూ.2 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడారు. వివరాలోకి వెళ్తే.. కేశంపేట మండల పరిధిలోని బైర్కాన్‌పల్లి గ్రామంలో సర్వే నంబర్ 53/1లో దాదాపు ఆరెకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీని విలువ మార్కెట్లో దాదాపు రూ.5 కోట్లు విలువ ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. ఈ భూమికి అనుకుని 53/15లో ప్రైవేట్ వ్యక్తులకు ఐదెకరాల పట్టా భూమి ఉంది. సదరు వ్యక్తి వెంకటపూరం లక్ష్మమ్మ తన భూమికి ఫెన్సింగ్ వేసే క్రమంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి హద్దు రాళ్ల పాతి, పెన్సింగ్ వేసింది. దీనిపై గ్రామ మాజీ సర్పంచ్ రూప్లానాయక్, అంజయ్య, యాదగిరిచారి తహసీల్దార్ అజాంఅలీకి ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దార్ శుక్రవారం సర్వేయర్ వెంకటేష్, ఆర్ఐ నివేదితను సర్వే చేయడానికి పంపించారు. సర్వే చేస్తున్న క్రమంలో పట్టాదారు లక్ష్మమ్మతోపాటు మరికొందరు అధికారులను అడ్డుకున్నారు. తాము కొనుగోలు చేసిన హద్దుల ప్రకారమే ఫెన్సింగ్స్ చేశామని తెలిపారు. అధికారులు వారికి నచ్చజెప్పి సర్వే చేశారు. 2.27 ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఫెన్నింగ్ వేసినట్లు గుర్తించారు. ఈ విషయం పట్టాదార్లకు వివరించారు. వారు పాతిన ఫెన్సింగ్, హద్దురాళ్లను గ్రామస్తుల సమక్షంలో తొలిగించారు. ప్రభుత్వ భూమిని కాపాడిన అధికారులను గ్రామస్తులు అభినందించారు.

ఎమ్మెల్సీలుగా దివ్యాంగులకు అవకాశం కల్పించాలి

దోమ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖాళీ కానున్న ఐదు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాల్లో దివ్యాంగులకు కేటాయించాలని భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 78 ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశంలో రాజ్యాధికారానికి దూరమై దుర్భర జీవితాలు గడుపుతున్న దివ్యాంగులకు ప్రభుత్వం సముచిత స్థానం కల్పించాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పోతురాజు సుధీర్, మండల అధ్యక్షుడు చుక్కయ్య, పరిగి మండల అధ్యక్షుడు చంద్రయ్య, దోమ మండల మీడియా కన్వీనర్ మహేశ్, ప్రధాన కార్యదర్శి బోయిని వెంకటయ్య, భారతి జంగయ్య, పరిగి మండల ఉపాధ్యక్షుడు నారాయణ, కోళ్ల మంగమ్మ, కిష్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలపై ఆరా..

» కరన్‌కోట్ నాపరాతి గనుల్లో అధికారుల తనిఖీ

తాండూరురూరల్, ఫిబ్రవరి 28, (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కరన్‌కోట్, ఓగీపూర్ నాపరాతి గనుల్లో అక్రమ తవ్వకాలపై రెవెన్యూ, మైన్స్, విద్యుత్ శాఖ అధికారులు సంయుక్తంగా శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సర్వేనంబర్-2 ప్రభుత్వ భూమిలో రమేశ్ అనే వ్యక్తి అక్రమ తవ్వకాలపై ఆరా తీశారు. విచారణలో గుర్తించిన అధికారులు ఈ విద్యుత్ సరఫరా ఎక్కడి నుంచి వస్తుందనే విషయంపై ఆరా తీశారు. సమీపంలోని పురాన్ శర్మ అనే వ్యక్తి నాపరాతి గని నుంచి 103 సర్వీస్ కనెక్షన్ ద్వారా అక్రమంగా లైన్ తీసుకొన్నట్లు లైన్‌మెన్ గరివప్ప వివరించారు. అనంతరం ఆర్ఐ నిర్మల, టెక్నికల్ అసిస్టెంట్ నాగలక్ష్మి, రెవెన్యూ ఆర్ఐ గోపి, సర్వేయర్ మహేష్‌ల బృందం అక్కడ తవ్వకాలపై టేప్‌తో మెజర్‌మెంట్స్ తీసుకున్నారు. సమీపంలోని సర్వే నంబర్-103లోని అక్రమ విద్యుత్ కనెక్షన్లు తొలగించారు. సర్వేనంబర్-2లో మైన్స్ లీజు లేకుండానే ఎంత మంది తవ్వకాలు జరుపుతున్నారనే విషయంపై ఆరా తీశారు. సమీపంలోని మాను సర్వీస్ కనెక్షన్ నెంబర్-849, ఆరీఫ్ అనే వ్యక్తులు తవ్వకాలు జరుపుతున్నారని గుర్తించారు. వీరికి అనుమతులు ఉన్నాయా, ఎక్కడి నుంచి విద్యుత్ సరఫరా అవుతుందనే దానిపై విచారణ జరుపుతామని పేర్కొన్నారు. లీజులు లేకుండా అక్రమ తవ్వకాలు చేపడితే సీజ్ చేసి జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

చేవెళ్లలో జిల్లా అదనపు కోర్టు ప్రారంభం


అదనపు కోర్టును ప్రారంభిస్తున్న అదనపు జడ్జి ప్రదీప్‌నాయక్

చేవెళ్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన డిజిటలైజేషన్ సెంటర్‌తోపాటు విట్‌నెస్ డిపోజిషన్ సెంటర్‌ను హై కోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజోయ్‌పాల్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం రాజేంద్రనగర్, చేవెళ్ల కోర్టులను డిజిటల్ పద్ధతిలో ప్రారంభించారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలోని కోర్టు భవనాల సముదాయంలో నూతనంగా రంగారెడ్డి జిల్లా అదనపు సెషన్స్ జడ్జి కోర్టు ప్రారంభమైంది. హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సామ్‌కోసి, రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి సమక్షంలో వర్చువల్‌గా జిల్లా అదనపు కోర్టును ప్రారంభించారు. చేవెళ్ల కోర్టు భవనంలో జిల్లా అదనపు జడ్జి ప్రదీప్‌నాయక్ సమక్షంలో న్యాయవాదులు, కోర్టు అధికారులు ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్టు భవనంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ కోర్టు జడ్జి దశరథ రామయ్య, సీనియర్ న్యాయవాదులు రేసు మహేందర్‌రెడ్డి, రాంరెడ్డి, చేవెళ్ల కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్యానందం, ప్రభుత్వ ప్లీడర్ బక్కరెడ్డి యాదిరెడ్డి, చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో హిమబిందు ఉన్నారు.


మంగల్‌పల్లి మహమ్మాయి ఆలయం సమీపంలో చెక్‌డ్యాంకు గండి

చెక్ డ్యామ్‌కు గండి.. నీరు వృథా

ఆదిభట్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వానకాలంలో కురిసే నీరు వృథాగా పోకుండా భూగర్భ జలాలు పెంచేందుకు ప్రభుత్వాలు ఈజీఎస్ పథకం కింద నిధులు కేటాయించి చెక్‌డ్యాంలు నిర్మించింది. ఆదిభట్ల మున్సిపల్ పరిధిలో ప్రవహించే పులందరి వాగుపై మంగల్‌పల్లి(మహమ్మాయి దేవాలయం)సమీపంలో చెక్‌డ్యాంను నిర్మించారు. ఈ చెక్‌డ్యాంలో నీరు నిల్వ ఉండడంతో మత్స్యకారులు చేపల పెంపకం చేపట్టారు. అయితే ఆదిభట్ల మున్సిపాలిటీ వేగంగా అభివృద్ధి చెందుతుండడంలో కాలనీలు పెరిగాయి. ఆయా కాలనీల నుంచి వెలువడుతున్న డ్రైనేజీ నీరు పులందరి వాగులో కలవడంతో మంగల్‌పల్లి, శేరిగూడ సమీపంలో నిర్మించిన చెక్‌డ్యాంలోకి మురుగు నీరు వచ్చి చేరుతుంది. మంగల్‌పల్లి మహమ్మాయి గుడి దగ్గర వరకు ఆ నీరు చేరడంతో అక్కడ ఉన్న ఆంజనేయస్వామి విగ్రహం మురుగు నీటిలో మునిగిపోతుంది. దీంతో ఆలయ కమిటీ వాళ్లు చెక్‌డ్యాంకు గండికొట్టినట్లు తెలిసింది. ఇప్పటికైనా అధికారులు పులందరి వాగులో డ్రైనేజీ నీరు కలవనీయకుండా చర్యలు చేపట్టి చెక్‌డ్యాంకు మరమ్మతులు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఎర్రమట్టి తవ్వకాలను అడ్డుకున్న భక్తులు

వికారాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఎర్రమట్టి తవ్వకాలు చేస్తుండడంతో భక్తులు అడ్డుకున్నారు. మహాశివరాత్రి సందర్భంగా వికారాబాద్ మండలం పులుసుమామిడి గ్రామంలో పరమేశ్వర దేవాలయ చుట్టూ భక్తులు గిరిప్రదక్షిణ చేపట్టగా కొందరు జేసీబీలు పెట్టి పరమేశ్వరుడి గుట్టను తవ్వుతుండగా భక్తులు అడ్డుకున్నారు. జేసీబీని చుట్టుముట్టి ప్రశ్నించారు. గత కొన్ని నెలలుగా ఈ అక్రమ మట్టి తవ్వకాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పగలూరాత్రి తేడా లేకుండా మట్టిని తరలిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు మండల పరిధిలో జరుగుతున్న ఎర్రమట్టి తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కొందరూ అధికారులు లంచాలకు అలవాటు పడి ఎర్రమట్టి లారీలు పట్టుకుని విడిచి పెడుతున్నారని, అధికారులు పూర్తిగా సీజ్ చేసినట్లైతేనే ఈ ఎర్రమట్టి దందా ఆగుతుందని స్పష్టం చేశారు.

పత్తిసాగుకు తేలికపాటి నేలలు అనుకూలం

పరిగి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పత్తిసాగుకు తేలికపాటి నేలలు అధిక సాంద్రత పత్తి సాగుకు అనుకూలమని వ్యవసాయ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సి.సుధారాణి అన్నారు. ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం పరిగి మండలంలోని సయ్యద్‌పల్లిలోని రైతువేదికలో పత్తిసాగుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పరిగి ఏఎంసీ చైర్మన్ బి.పరశురాంరెడ్డి, శాస్త్రవేత్తలు డాక్టర్ యమున, టి.రాజేశ్వర్, టి.లక్ష్మణ్, వైజయంతి పాల్గొన్నారు.

సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవాలి

- ప్రత్యేకాధికారులు, ప్రధానోపాధ్యాయులు
- ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవాలని కొందుర్గు మండల విద్యాధికారిణి గాయత్రీదేవి అన్నారు. శుక్రవారం కొందుర్గు మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో సైన్స్ దినోత్సవ వేడుకలను పాఠశాల ప్రత్యేకాధికారిణి నిస్సీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తరగది గదిలో తార్కికంగా ఎలా అవలంబించాలి, సైన్స్ ఎలా చదువుకోవాలని, నిజ జీవితంలో సైన్స్ ఉపయోగాలను తెలియజేశారు. ఉపాధ్యాయులు తదితరులున్నారు.

షాబాద్ : వైజ్ఞానిక ప్రదర్శనలతోనే విద్యార్థుల మేధస్సు పెంపొందుతుందని మాంటిస్సోరీ ఉన్నత పాఠశాల హెచ్ఎం సుధాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చేసిన వివిధ రకాల ప్రయోగాలను పరిశీలించి వాటి ఉపయోగాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. మండల పరిధిలోని మన్‌మర్రి ప్రాథమిక పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవంలో హెచ్ఎం అనురాధ, ఉపాధ్యాయులు వెంకటమ్మ అశోక్‌లు విద్యార్థులు చేసిన ప్రాజెక్టులు పరిశీలించి, బహుమతులందజేశారు.


షాబాద్ : విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలిస్తున్న హెచ్ఎం సుధాకర్‌రెడ్డి తదితరులు

ఆమనగల్లు : పట్టణంలోని లిటిల్ స్కాలర్స్ టెక్నోస్కూల్‌లో వైజ్ఞానిక వస్తు ప్రదర్శన మేళా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ చుక్కా అల్లాజీ గౌడ్, కరస్పాండెంట్ జిల్లెల్ల సుజాత సుదర్శన్‌రెడ్డి, డైరెక్టర్ చుక్క సావిత్రి, అకడమిక్ అడ్వైజర్ సుదర్శన్‌రెడ్డి లతో కలిసి మేళాను ఎంఈవో పాండు ప్రారంభించారు. 250 మంది విద్యార్థినీ విద్యార్థులచే రూపొందించిన వస్తు సామగ్రి ప్రదర్శనలు, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాన్ని చాటే బోనాలు, బతుకమ్మ, పోతురాజుల విన్యాసాలు సందర్శకులను అమితంగా ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ చెన్నయ్య, ఉపాధ్యాయులు, ట్రస్మా డివిజన్ అధ్యక్షుడు శ్రీరాములు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శివలింగం, ఉపాధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, గోలి శ్రీను, శర్మ, కోట్ల వెంకటేశ్ పాల్గొన్నారు.


యాచారం : కుర్మిద్ద ఉన్నత పాఠశాలలో గ్రహాల సంచారంపై విద్యార్థుల ప్రదర్శన


ఆమనగల్లు : సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు

యాచారం : మండలంలోని మేడిపల్లి, కుర్మిద్ద ఉన్నత పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. కుర్మిద్ద ఉన్నత పాఠశాలలో గ్రహాల సంచారంపై బాలికల ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. విద్యార్థులు తమ శక్తికి మించి ప్రదర్శనలు చేయడం ఆనందంగా ఉందని మేడిపల్లి, కుర్మిద్ద పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉదయశ్రీ, సత్తు పాండురంగారెడ్డిలు తెలిపారు.

రంగారెడ్డి అర్బన్ : విద్యార్థులు పరిశోధనలపట్ల ఆసక్తిని పెంచుకొని నూతన ఆవిష్కరణలు చేయాలని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.రాధిక అన్నారు. శుక్రవారం జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత, భౌతిక, రసాయన, వృక్ష శాస్త్ర విభాగాలు సంయుక్తంగా సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశాయి. విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రాజెక్టులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా క్విజ్ పోటీలను నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డెల్ కంపెనీ సహకారంతో ప్రత్యేకంగా మహిళా విద్యార్థులకు నెల రోజులుగా కళాశాల విద్య కమిషనర్ ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును నిర్వహిస్తున్నామన్నారు. ఈ కోర్సు ద్వారా నేర్చుకున్న కొత్త విషయాలు, అనుభవాలను విద్యార్థులు వివరించారు. ఎప్పటికప్పుడు టెక్నాలజీని ఆకలింపు జేసుకుంటూ విద్యార్థులు ముందుకు పోవాలన్నారు. టీఎస్‌కేసీ కో ఆర్డినేటర్ జి.హృదయరాజు, టీఎస్‌కేసీ మెంటార్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డా.కె.సురేష్‌తోపాటు అధ్యాపకులు పాల్గొన్నారు.


రంగారెడ్డి అర్బన్ : పట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రదర్శనలను తిలకిస్తున్న ప్రిన్సిపాల్ రాధిక తదితరులు

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా నేడు(శనివారం) శంషాబాద్ పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ షేక్‌బాషా ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎమ్మార్వో కార్యాలయం, నక్షత్ర విల్లా, ఆర్‌బీ నగర్, సీఏస్ఎకే కాలనీ, రాఘవేందర్ కాలనీ, శ్రీ బాలాజీ టౌన్‌షిప్, రాళ్లగూడ, ప్రకాష్‌నగర్, యాదవ కాలనీ, పోర్టుగ్రౌండ్, కొత్వాల్‌గూడ, మధురా నగర్, శ్రీనివాస్‌కాలనీ, ఆదర్శనగర్‌లలో సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆమనగల్లు మండల పరిధిలో..

ఆమనగల్లు : మండల పరిధిలోని పోలెపల్లి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నేడు(శనివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శంకర్‌నాయక్ తెలిపారు. ఫీడర్‌లో చెట్లకొమ్మల తొలగింపు, లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. పోలెపల్లి, చెన్నంపల్లి, సింగంపల్లి, చంద్రాయన్‌పల్లి పరిధిలో సరఫరా ఉండదన్నారు.

ఆర్థిక సాయం

తలకొండపల్లి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఇటీవల మృతిచెందిన రాజు కుటుంబాన్ని శుక్రవారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. రాజు మృతి పట్ల సంతాపం తెలిపారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరు ప్రభాకర్ రెడ్డి రూ.3వేల ఆర్థిక సాయం అందజేశారు. పీసీసీ కిసాన్ సెల్ కార్యదర్శి మోహన్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ అజీం, డీసీసీ కార్యదర్శి రవీందర్ యాదవ్, నాయకులు రమేశ్, నర్సింహ్మా, యాదగిరి, గణేశ్, శేఖర్, శ్రీనివాస్, మైసయ్య, తదితరులున్నారు.

క్రైం కార్నర్

తప్పుడు పత్రాలతో ఐదెకరాల భూమి రిజిస్ట్రేషన్

- ముగ్గురిపై కేసు.. పలువురి ప్రమేయం!

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): భూ యజమానికి తెలియ కుండా 5 ఎకరాల భూమికి తప్పుడు పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తిని మహేశ్వరం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ టప్పా చబుత్రాకు చెందిన విజయలక్ష్మికి తుమ్మలూరు గ్రామంలోని సర్వే నెంబర్ 378లో 5 ఎకరాలు పట్టా భూమి ఉంది. అయితే, భూ యజమాని విజయలక్ష్మికి తెలియకుండా మహేశ్వరం గ్రామానికి చెందిన మహ్మద్ శుకూర్, చాంద్రాయణగుట్టకు చెందిన సాబేర్, బస్రవిలతో పాటు మరికొంత మంది ఐదెకరాల భూమిని శుకూర్ పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. దాంతో అసలు విషయాన్ని గమనించిన భూయజమాని విజయలక్ష్మి 2024 సెప్టెంబరు 21న మహేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు విచారణ చేపట్టగా విజయలక్ష్మికి చెందిన 5 ఎకరాల భూమికి తప్పుడు పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిలో శుకూర్, సాబేర్, బస్రవిలతో పాటు మరికొంత మంది ఉన్నట్లు నిర్ధారణ కాగా.. శుక్రవారం చాంద్రాయణగుట్టకు చెందిన బస్రవిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో శుకూర్ ముందస్తు బెయిల్ తెచ్చుకోగా మరికొంత మంది పరారీలో ఉన్నట్లు మహేశ్వరం పోలీసులు తెలిపారు.

అదుపుతప్పి ఆటో బోల్తా

- 10మంది విద్యార్థులు, డ్రైవర్‌కు గాయాలు


విద్యార్థులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శంకర్

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణ శివారులోని హైదరాబాద్ రోడ్డులో శుక్రవారం ఉదయం ఆటో అదుపు తప్పి బోల్తాపడిన ఘటనలో డ్రైవరుతో పాటు అందులో ప్రయాణిస్తున్న పలువురు విద్యార్థులు గాయపడ్డారు. పట్టణంలోని సత్యసాయి పాఠశాలకు చెందిన ప్యాసింజర్ ఆటో నందిగామ మండలంలోని వీర్లపల్లి, చర్ల అంతిరెడ్డిగూడ, అప్పారెడ్డిగూడ గ్రామాలకు చెందిన విద్యార్థులను ఎక్కించుకుని షాద్‌నగర్‌కు వస్తుండగా రెడ్‌రోజ్ గార్డెన్ సమీపంలో యూటర్న్ వద్ద రాంగ్‌రూట్ వస్తున్న బైక్‌ను తప్పించబోయి ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దాంతో ఆటో డ్రైవర్ తోపాటు అందులో ఉన్న సుమారు 10మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. వారిని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. కాగా, సమాచారం తెలుసుకున్న షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆసుపత్రి ద్దకు వెళ్లి గాయపడిన వారిని పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరుపై డ్రైవర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అనారోగ్యంతో కండక్టర్ ఆత్మహత్య

యాచారం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): చాలా కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఓ ఆర్టీసీ కండక్టర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం యాచారం పంచాయతీ పరిధిలోని గాండ్లగూడలో చోటుచేసుకుంది. గాండ్లగూడకు చెందిన కొరె అంజయ్య ఇబ్రహీంపట్నం డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే, అతడు కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తార్నాకలోని ప్రభుత్వ ఆసుపత్రితో పాటు పలు చోట్ల చికిత్స చేయించుకున్నాడు. వ్యాధి నయం కాకపోవడంతో శుక్రవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబికులు నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు. అంజయ్యకు భార్య శోభ, కుమారుడు ఉదయ్, కుమార్తె దివ్య ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో కార్పొరేట్ స్థాయి వైద్యం


చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధితో పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతుందని ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. శుక్రవారం చేవెళ్లలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన 27మంది లబ్దిదారులకు మంజూరైన రూ.10,97000 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. చేవెళ్ల, ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, చేవెళ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, చేవెళ్ల, షాబాద్ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వీరేందర్‌రెడ్డి, కావలి చంద్రశేఖర్ ముదిరాజ్, చేవెళ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, డైరెక్టర్లు పాండు, జనార్దన్, మాజీ సర్పంచ్‌లు బండారు శైలజాఆగిరెడ్డి, నర్సింలు, సీనియర్ నాయకులు పి. కృష్ణారెడ్డి, ఎం. నరేందర్‌గౌడ్, బల్వంత్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సభలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి

యాచారం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఎలాంటి ఉద్యమాలైనా, ఆందోళనలైనా శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులకు సూచించారు. శుక్రవారం మండలంలోని తాటిపర్తిలో ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ సమావేశం అనంతరం కమిటీ నాయకులతో ఏసీపీ మాట్లాడారు. రైతులను రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేయరాదని, అలా చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. కాగా, తాటిపర్తి ప్రాథమిక పాఠశాలను సీఐ లిక్కి కృష్ణంరాజు, ఎస్సై తేజంరెడ్డిలు సందర్శించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారితో కలిసి భోజనం చేశారు. మీకేమైన ఇబ్బందులుంటే తమ దృష్టికి తీ సుకురావాలని చెప్పారు.


యాచారం : నాయకులతో మాట్లాడుతున్న ఏసీపీ కేపీవీ రాజు

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

ఆదిభట్ల : యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఉన్నత విద్యనభ్యసించాలని ఏసీపీ రాజు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తులేకలాన్ గ్రామంలో గంజాయి, డ్రగ్స్, ఆన్‌లైన్ గేమ్స్, చైన్ స్నాచింగ్‌లపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువత గంజాయి డ్రగ్స్, ఆన్ లైన్ గేమ్స్‌కు అలవాటు పడకుండా దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్లు మోసం చేసినట్లు గ్రహిస్తే వెంటనే డయల్ 1930కు కాల్‌చేసి చెప్పాలన్నారు. సీఐ జగదీశ్వర్, ఎస్సై రామకృష్ణ, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

వైభవంగా పార్వతీ పరమేశ్వరుల పరిణయం

పలు చోట్ల ముగిసిన బ్రహ్మోత్సవాలు

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కేశంపేట మండల పరిధిలోని కాకునూర్ శివారులోని మహాలింగేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. పండితులు సుధాకర్ శర్మ, కొటప్ప, జంగం మహాలింగం, మఠం చంద్రశేఖర్, జంగం కుమార్‌లు ఆదిదంపతుల కల్యాణ తంతు నిర్వహించారు. పలుస శివానీ-మహేష్ గౌడ్, ప్రియాంక-యశ్వంత్ గౌడ్, గట్టు సౌజన్య రెడ్డి-శివకుమార్ రెడ్డి, మోటె నిత్యశ్రీ-సాయికృష్ణ దంపతులు కల్యాణం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులకు తాళ్ల భాగ్యలక్ష్మీ శ్రీధర్‌గౌడ్ దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ నర్సింలుగౌడ్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లి : చెన్నారం సమీపంలోని మల్లప్పగుట్టపై వెలసిన శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగిశాయి. శుక్రవారం చక్రతీర్థం, పెద్ద మంగళహారతి, ప్రత్యేక పూజలు, పల్లకీసేవ నిర్వహించారు. నిర్వాహకులు, నాయకులు కల్లు పెంటారెడ్డి, మాకం పాండయ్య, ఏమిరెడ్డి పాండురంగారెడ్డి, ఏమిరెడ్డి శేఖర్ రెడ్డి, మల్లారెడ్డి, తదితరులున్నారు.

ఆమనగల్లు : రాంనుంతల గేటు సమీపంలో గల అయ్యసాగర్ శ్రీ త్రిపురాంతకేశ్వర వీరభద్రస్వామి భద్రకాళీ సరస్వతి, శ్రీరామాంజనేయ దేవాలయాలలో మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం తెల్లవారుజామున అగ్నిగుండాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. లేమామిడికి చెందిన అర్చకుడు మఠం శేఖరయ్య, ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. శృతిలయ కల్చరల్ అకాడమీ నిర్వాహకుడు చిత్తరంజన్ దాస్ ఆధ్వర్యంలో సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. నిర్వాహకులు, నాయకులు శ్రీపతి కరుణాకర్‌రెడ్డి, భట్టు నర్సిరెడ్డి, ఎన్.టి పంచాక్షరి, ఎం. మల్లప్ప, చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులున్నారు.

కడ్తాల్, : మైసిగండిలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ముగిశాయి. చక్రతీర్థం, ప్రత్యేక పూజలు, స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ సిరోలిపంతూ, ఈవో స్నేహలత, ఉత్సవ నిర్వాహకుడు రామావత్ భాస్కర్, తహసీల్దార్ ఆర్.పి జ్యోతి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు తులసీరామ్ నాయక్, శేఖర్‌గౌడ్, అర్చకులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.


రంగారెడ్డి అర్బన్ : కేశంపేట మండలం కాకునూర్ శివారులో మహాలింగేశ్వర స్వామి కల్యాణం


కడ్తాల్ : ఉత్సవ విగ్రహాల ఊరేగింపు లో భక్తులు

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

రంగారెడ్డి అర్బన్ : మహేశ్వరం శ్రీ శివగంగ రాజరాజేశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రుద్రహోమం, కుంకుమార్చన, మంగళహారతి, సహస్రనామార్చనతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకుంటున్నాయి. ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, మాజీ చైర్మన్లు కూన యాదయ్య, కాకి ఈశ్వర్ ముదిరాజ్, నిమ్మగూడెం సుధీర్‌గౌడ్, పోతర్ల సుదర్శన్‌యాదవ్, మునగపాటి నవీన్, కాకి కుమార్, డైరెక్టర్లు ఎం.రాజేష్, సాయులు, శ్రీశైలం, నరేష్, తిరుపతయ్య, సువర్ణలతో పాటు నాయకులు పూర్ణచంద్రారెడ్డి, ఆనందం, సూర్యనారాయణరెడ్డి, జంగయ్య, ఈవో మురళీకృష్ణ, ఆలయ ప్రధాన అర్చకులు వీరేషం తదితరులు పాల్గొన్నారు.

భవాని మాత ఆలయానికి భారీ వెండి కానుక

రంగారెడ్డి అర్బన్ : ఫరూక్‌నగర్ మండలంలోని ఎలికట్ట భవాని మాత ఆలయానికి మొగిలిగిద్ద గ్రామానికి చెందిన కక్కునూరి లక్ష్మీ వెంకటేష్‌గుప్త దంపతులు భారీ వెండి కానుకను బహుకరించారు. శివరాత్రి అమావాస్యను పురష్కరించుకుని శుక్రవారం భవాని మాతకు పూజలు చేసి, ఆలయ గర్భగుడిలో ఉన్న శివుడిపై నీటి ధార కోసం 2.750 కిలోల వెండి పాత్రను చేయించి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ ముత్యాల రాజుకు అందజేశారు. వెంకటేష్‌గుప్త కుటుంబ సభ్యులను ముత్యాల రాజు, పూజారులు అభినందించారు.


యాచారం : నందీశ్వరుడిని రథంపై ఊరేగిస్తున్న భక్తులు

వైభవంగా శివ జయంత్యుత్సవాలు

షాబాద్ : ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శివజయంతి ఉత్సవాలు శుక్రవారం షాబాద్, నాగర్‌గూడలో వైభవంగా నిర్వహించారు. నిర్వాహకురాలు బీకే లక్ష్మి శాంతి జెండాను ఆవిష్కరించిన అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఆమె మాట్లాడుతూ శివ జయంతి సందర్భంగా పరమాత్మ గురించి ప్రతీ ఒక్కరు తెలుసుకోవాలని సూచించారు. విశ్వవిద్యాలయం అన్నయ్యలు, అక్కలు పాల్గొన్నారు.

యాచారం : నందివనపర్తిలో శుక్రవారం ఉదయం నందీశ్వర స్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. వివిధ గ్రామాల భక్తులు పూజలు, అభిషేకాదులు చేశారు.


రాజ్‌నాథ్‌సింగ్‌కు బీజేపీ నేతల ఘన స్వాగతం




గచ్చిబౌలి స్టేడియంలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని డీఆర్డీవో ఆధ్వర్యంలో డిఫెన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ముఖ్యఅతిథిగా హాజరై ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి రాజ్‌నాథ్‌కు ఘన స్వాగతం పలికారు.

- రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి)

ఘనంగా గంప వెంకటేశ్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కడ్తాల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు గంప వెంకటేశ్ గుప్త జన్మదిన వేడుకలు శుక్రవారం కడ్తాల మండల కేంద్రంలో ఆట్టహాసంగా నిర్వహించారు. స్థానిక పాలశీతలీకరణ కేంద్రం ఎదుట బీఆర్‌ఎస్, జీవీజీ యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, రైతు సమన్వయ సమితి మాజీ మండలాధ్యక్షుడు జోగు వీరయ్య, జీవీజీ అధ్యక్షుడు ఎస్.ఎం. శ్రీకాంత్, ఆమనగల్లు మాజీ జడ్పీటీసీ అనురాధ పత్యానాయక్, ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గంప శ్రీను, సురేశ్, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి దశరథ్ నాయక్ కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. మండల కేంద్రంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి మొక్కలు నాటారు. వృద్ధులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు పోతుగల్ల మహేశ్ ఆధ్వర్యంలో ప్లేట్లు పంపిణీ చేశారు. నాయకులు కడారి రామకృష్ణ, లాయక్‌అలీ, సేవ్యానాయక్, అంజి, బెల్లి వెంకటయ్య, రమేశ్, చంద్రమౌళి, గోపాల్, మహేశ్, మంగళపల్లి నర్సింహ, రామచంద్రయ్య, పాండు, ఈర్షద్, కృష్ణ, సిహెచ్ మహేశ్, మూడ రవి, శ్రీనివాస్, కిషన్, తదితరులున్నారు. వెంకటేశ్‌కు మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి శుభాకాంక్షలు చెప్పారు.


కడ్తాలలో మొక్కలు నాటుతున్న మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్

వీధికుక్కల బెడదను అరికట్టాలి

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలో రోడ్డుపై వెళ్తున్న వారిని సైతం వెంబడించి కాటేస్తున్న వీధి కుక్కలను అరికట్టడానికి మున్సిపాలిటీ చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్ కోరారు. 24వ వార్డు మాజీ కౌన్సిలర్ రేటికల్ నందీశ్వర్ కుమార్తె దీపికను ఇటీవల ఊర కుక్కలు వెండించడంతో ఆమె కిందపడి గాయపడింది. విషయం తెలుసుకున్న అంజయ్యయాదవ్ శుక్రవారం నందీశ్వర్ ఇంటికి వెళ్లి, వీధి కుక్కలు దీపికను వెంబడించిన తీరును సీసీ ఫుటేజీలో పరిశీలించి, విచారం వ్యక్తం చేశారు. రోజురోజుకు పెరుగుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న కుక్కల నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మున్సిపల్ సిబ్బందిని కోరారు. బీఆర్‌ఎస్ నాయకులు గణేష్, దేవేందర్‌యాదవ్, వెంకటేష్‌గౌడ్, రఘునాథ్‌యాదవ్ తదితరులున్నారు.

సంక్షిప్తంగా..

రంగారెడ్డి అర్బన్ : మహిళల ఆత్మ రక్షణకు కరాటే ఎంతో అవసరమని జిల్లేడ్ చౌదరిగూడ ఎంఈవో కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని లాల్‌పహాడ్ కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం విద్యార్థులు ఇటీవల ఆదిలాబాద్‌లో నిర్వహించిన కుంగ్‌ఫూ పోటీల్లో ప్రతిభ కనబర్చారు. శుక్రవారం విద్యార్థులను ఉపాధ్యాయులతో కలిసి ఎంఈవో సన్మానించారు.

రంగారెడ్డి అర్బన్ : నాలుగు నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, ఒకవేళ వేతనాలు ఇవ్వకుంటే మార్చి 3 నుంచి విధులకు గైర్హాజరవుతామని ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్స్ అసోసియేషన్ కేశంపేట మండల శాఖ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపడీవో రవిచంద్రకుమార్ రెడ్డికి వినతిపత్రం అందించారు. జిల్లా శాఖ ఆదేశాల మేరకు వినతిపత్రం అందించినట్లు కంప్యూటర్ ఆపరేటర్లు శ్రీకాంత్, మమతలు తెలిపారు. గత నాలుగు నెలలుగా వేతనాలు అందక నానా ఇబ్బందులు పడుతున్నామని వివరించారు.

ఆమనగల్లు : టైలరింగ్ పితామహుడు విలియమ్స్ హో జయంతి సందర్భంగా ఆమనగల్లు పట్టణంలో టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్‌డే వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణ టైలర్లు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సంఘ సేవకుడు పాపిశెట్టి రాము ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విలియమ్స్ చిత్ర పటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

దోపోత్సవం.. భక్త జనసందోహం

(5వ పేజీ తరువాయి)

పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవాలయం ధర్మకర్తలు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. అనంతరం వారికి స్వామివారి తీర్థప్రసాదాలను పూజారులు అందజేశారు. అనంతరం చేపట్టిన అన్నదాన కార్యక్రమాన్ని మహేందర్‌రెడ్డి ప్రారంభించారు. చేవెళ్లకు చెందిన సెవన్ హిల్స్ గ్రూప్ సభ్యులు, చేవెళ్ల గ్రామానికి చెందిన అత్తెల్లి జగనాథ్‌రెడ్డిలు సైతం ఏర్పాటు చేసిన ఉచిత అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అలాగే చేవెళ్ల మాజీ ఎంపీ బాల్‌రాజ్, పట్టణానికి చెందిన నారాయణ యాదవ్ సొంత డబ్బులతో ఏర్పాటు చేసిన వైకుంఠ రథాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీ మాజీ అధ్యక్షులు పడాల వెంకట్‌స్వామి, మాజీ ఎంపీపీలు ఎం. బాల్‌రాజ్, ఎం. విజయలక్ష్మీ, మాజీ జెడ్పీటీసీ మాలతి కృష్ణారెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్‌లు బండారి శైలజాఆగిరెడ్డి, వెంకటమ్మవిఠలయ్య, నాగమ్మ, పీఏసీఎస్ చైర్మన్‌లు దేవర వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు వసంతం, రాములు, దేవస్థానం మేనేజర్ నరేందర్, ఆలయ ధర్మకర్తలు దేవుని వామనాచార్యులు, శ్రీపాదులు, పూజారులు అనంతం, వాసుదేవచార్యులు కన్నా, వైభవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్. వైస్ చైర్మన్ రాములు, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ యాదగిరి, యువ నాయకుడు ఎం. వెంకటేశ్, ప్రభాకర్, వీరేందర్‌రెడ్డి, మాణిక్యరెడ్డి, బి.నర్సింలు, కృష్ణ, కె.తిరుపతిరెడ్డి, మాణిక్యప్రభు, దామోదర్‌యాదవ్, నర్సింలు, శ్రీనివాస్‌గౌడ్, నరేందర్ గౌడ్, మాణిక్యం, వెంకటేశ్, యాదయ్య, బాలు పాల్గొన్నారు.


ఆలయంలో పూజలు చేస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య

బకాయి పాలబిల్లుల కోసం 'చలో సెక్రటేరియేట్'

కడ్తాల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): విజయ పాడి రైతులకు రావాల్సిన ఐదు పక్షాల బకాయి బిల్లులను వెంటనే చెల్లించకపోతే చలో సెక్రటేరియేట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతామని పాడి రైతుల సంఘం జిల్లా నాయకుడు, కడ్తాల పాల సేకరణ కేంద్రం అధ్యక్షుడు కడారి రామకృష్ణ హెచ్చరించారు. కడ్తాల మండల కేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ 15 రోజులకోసారి చెల్లించాల్సిన బిల్లులు రెండున్నర నెలలైనా చెల్లించకపోవడం వల్ల రైతులకు ఇబ్బందిగా మారిందని ఆయన తెలిపారు.